నూతన భవనానికి మోక్షమెప్పుడో?

• నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని ఆస్పత్రి • పట్టించుకోని పాలకులు, అధికారులు



నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని ఆస్పత్రి భవనం



పాత ఆస్పత్రిలో కూలడానికి సిద్ధంగా బాలింతల గది

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో నిర్మించిన నూతన ఆస్పత్రి భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో పాత ఆస్పత్రిలో మౌలిక వసతులు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. వివరాలు.. పెద్దవడుగూరులో రూ.లక్షలు వెచ్చించి గత ప్రభుత్వం నూతనంగా ఆస్పత్రి భవనం నిర్మాణం చేపట్టింది. అయితే పనులు పూర్తయి ఏడాది గడుస్తున్నా ఆస్పత్రి ప్రారంభానికి నోచుకోలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ ఆస్పత్రిని త్వరగా ప్రారంభించడానికి సిద్ధం చేయాలని గతంలో తనిఖీకి వచ్చినప్పుడు కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులు ఆదేశాలు జారీచేసినా పట్టించుకున్న పాపాన పోలేదు.

శిథిలావస్థలో పాత ఆస్పత్రి

గత 40 ఏళ్ల క్రితం నిర్మించిన పాత ఆస్పత్రి ఇప్పటికే శిథిలావస్థకు చేరుకుంది. బాలింతలు ఉండే గదిలో చీలికలు అధికావడంతో ఎప్పుడు కూలుతుందో కూడా తెలియని పరిస్థితి దాపురించింది. ఎవరైనా రోగులు చికిత్స చేయించుకోవడానికి వస్తే పైకప్పు ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి చూసి ప్రాణభయంతో వణుకుతున్నారు. వర్షం వచ్చిందంటే బాలింతల గది గోడలు ఉబ్బిపోతున్నాయి. రోగుల కోసం ఏర్పాటు చేసిన మంచాలు ఉన్న గదిలో పైకప్పు మొత్తం కారుతుంది. దీంతో నిత్యం పైకప్పు వైపు చూసుకుంటూనే చికిత్స తీసుకోవాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. అలాగే స్థానికంగా నివాసం ఉంటూ రోగులకు వైద్య సేవలు అందించడం కోసం నిర్మించిన క్వాటర్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో మౌలిక వసతులు లేక పలువురు సిబ్బంది దూర ప్రాంతాల నుంచి విధులకు హాజరు అవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, సిబ్బందికి మౌలిక వసతులను కల్పించడంతోపాటు నూతన ఆస్పత్రి భవనం ప్రారంభించాలని మండలవాసులు కోరుతున్నారు.

రోగులు భయపడుతున్నారు

పాత ప్రభుత్వాస్పత్రికి రోగులు రావాలంటేనే భయపడుతున్నారు. కొత్త ఆస్పత్రి భవనం ప్రారంభించడానికి ఎందుకు వెనకడుగు వేస్తున్నారో అర్థం కావడం లేదు. ఆరు నెలల క్రితం కలెక్టర్ ఆసుపత్రిని పరిశీలించినా ఇప్పటి వరకూ అధికారుల్లో ఎలాంటి చలనం లేదు.

– దస్తగిరి, సీపీఎం నాయకుడు



ఘనంగా గంధం మహోత్సవం



గంధం ఊరేగిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో ఆదివారం జోహరేపీర్ 8వ గంధం మహోత్సవం ముస్లిం మత పెద్దలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా నల్లగుట్ట వద్ద వెలసిన మసీదును విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం గుత్తిరోడ్డు లో ఉండే దస్తగిరి స్వామి కట్ట వద్ద నుంచి గంధం తీసుకుని గురుస్వాములు ఊరేగింపు గా పెద్దఎత్తున మత పెద్దలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, చిన్నారులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో కేసు నమోదు

గుత్తి: దాడి ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ సురేష్ తెలిపారు. గుత్తి ఆర్ఎస్‌లోని సుందరయ్య కాలనీలో శనివారం నరసింహులు అనే వ్యక్తిపై సుధాకర్ బీరు బాటిల్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు సుధాకర్‌పై ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలసిన వైవీఆర్



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మాజీ ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆదివారం మర్యాద పూర్వకరంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వైవీఆర్ బేటీ అయ్యారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అవలబింబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, సూపర్ సిక్స్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మరింత కృషి చేయాలని పెద్దిరెడ్డి సూచించారు. తాజా రాజకీయ పరిస్థితులపై వైవీఆర్‌తో ఆరా తీశారు.

విద్యార్థుల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం



మాట్లాడుతున్న మోహన్‌నాయక్

పామిడి: కూటమి ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా పాఠశాల, హాస్టల్ భవనాల నాసిరక నిర్మాణాల వల్ల విద్యార్థుల ప్రాణాలతో చెలగాట మాడుతోందని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బీ మోహన్‌నాయక్ మండిపడ్డారు. ఆదివారం ఆయన స్థానిక ప్రభుత్వ బాలుర వసతి గృహ విద్యార్థుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో కాంట్రాక్టర్ల నాసిరక నిర్మాణ పనుల వల్ల పాఠశాలలు, హాస్టల్ భవనాలకు చీలికలు ఏర్పడ్డాయన్నారు. తద్వారా వర్షపు నీరు భవనాల్లోకి వచ్చి విద్యార్థులకు అసౌకర్యానికి గురిస్తోందన్నారు. దీనికి తోడు భవనాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ బోర్డులు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. తద్వారా విద్యార్థుల ప్రాణానికి ప్రమాదం లేక పోలేదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి నాసిరకం పనులను మరమ్మతులు చేయాలన్నారు. లేనిపక్షాన విద్యార్థులను సంఘటితం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సమితి సభ్యులు భాస్కర్, మణికంఠ, రమణ, చంటి, బాబు, గోవిందు, చంద్రశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, భాషా, అశోక్, మంజు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి



జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు: ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, సమస్యలపై నిరంతరం ప్రభుత్వం పోరాటాలు చేస్తూ ఉండాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ సూచించారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో 14వ పట్టణ, రూరల్ ప్రతినిధుల మహాసభ నిర్వహించారు. తొలుత సీపీఐ పార్టీ జెండాను జగదీష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుంతకల్లు పట్టణ, రూరల్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ప్రస్తుతం ఉన్న కమిటీ సభ్యులనే యధావిధిగా కొనసాగించాలని తీర్మానించారు. పట్టణ కార్యదర్శిగా సాకే గోపీనాథ్, సహాయ కార్యదర్శిగా ఎస్ఎండీ గౌస్, పట్టణ కార్యవర్గ సభ్యులుగా వెంకట్ నాయక్, రూరల్ కార్యదర్శిగా రాముదాయల్ తోపాటు 19 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బి.గోవిందు, వీరభద్రస్వామి, మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టితో సరిపెట్టారు..



జేసీబీతో గుంతల్లో మట్టి వేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రం చెరువు కట్టపై ఉన్న రహదారి గుంతలతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని 'కలెక్టర్ గారూ.. మీరైనా స్పందించండి' అని సాక్షిలో వచ్చిన కథనానికి తెలుగు దేశం పార్టీ నాయకులు స్పందించారు. ఈ రహదారికి సరిహద్దుల్లో ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్నా పట్టించుకోలేదని కథనంలో పేర్కొనడంతో ఎట్టకేలకు తెలుగు తమ్ముళ్లు స్పందించారు. ఆగమేఘాలతో జేసీబీ తీసుకువచ్చి గుంతలలో మట్టి వేసి చేతులు దులుపుకున్నారు. రోడ్డు గుంతలకు తారు వేయకుండా కేవలం మట్టి వేసి తెలుగు తమ్ముళ్లు చేతులు దులుపు కోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.

పోటాపోటీగా జిల్లాస్థాయి భజన పోటీలు



ముకుందాపురంలో భజన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న గ్రామస్తులు

గార్లదిన్నె: మండలంలోని ముకుందాపురంలో పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ట సందర్భంగా శనివారం రాత్రి ఆలయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి భజన పోటీలు పోటాపోటీగా జరిగాయి. పోటీల్లో ఏడు భజన బృందాలు పాల్గొన్నాయి. పోటీలను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ పోటీల్లో వెంకటంపల్లికి చెందిన శ్రీరామ బృందం మొదటి స్థానం, కల్లూరుకు చెందిన శ్రీమారుతి భజన బృందం రెండో స్థానం, ససపకు చెందిన మాధవ రాజుల స్వామి భజన బృందం మూడో స్థానం, పి.కొత్తపల్లికి చెందిన అభయాంజనేయస్వామి భజన బృందం నాలుగో స్థానం, తలపూరుకు చెందిన చెన్నకేశవస్వామి భజన బృందం ఐదో స్థానం, వడ్డిపల్లికి చెందిన చంద్రమౌళీశ్వర స్వామి భజన బృందం ఆరో స్థానం, అనంత సాగరానికి చెందిన రామ లింగేశ్వర భజన బృందం ఏడో స్థానంలో నిలిచాయి. పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు నగదు అందజేశారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత



హరితను తండ్రికి అప్పగించిన సీఐ మస్తాన్

గుంతకల్లు: మస్తానయ్య దర్గాలో తప్పిపోయిన ఓ బాలికను తల్లిదండ్రులకు అప్పగించినట్లు టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహరాష్టకు చెందిన వ్యాపారి ప్రకాష్ మస్తానయ్య ఉరుసులో దుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. ఆయన కుమార్తె హరిత ఆదివారం మధ్యాహ్నం 12.00 గంటల సమయంలో ఆడుకుంటూ కనిపించకుండా పోయింది. ఎంత సేపుటికీ హరిత అంగడి వద్దకు రాకపోవడంతో ప్రకాష్ ఆందోళనకు గురయ్యాడు. వెంటనే దర్గా ఆవరణతోపాటు చుట్టుపక్కల అంతా వెతికాడు. హరిత ఆచూకీ లభించపోవడంతో సాయంత్రం 6 గంటల సమయంలో టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంటనే పోలీసులు స్పందించి పట్టణంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో గాలించారు. ఈ క్రమంలో ప్రభుత్వాస్పత్రి వద్ద ఓ వృద్ధుడి వద్ద ఉన్న పాపను పోలీసులు గుర్తించారు. వృద్ధుడిని విచారించగా.. పాప ఏడుస్తూ ఉంటే దగ్గరు తీసుకొని కూర్చోబెట్టుకున్నట్లు తెలిపాడు. అనంతరం ప్రకాష్ పిలిపించి కూతురు హరితను అప్పగించినట్లు సీఐ తెలిపారు.

తాడిపత్రిలో దంచికొట్టిన వాన



తాడిపత్రి మండలం ఆలూరు కోన వద్ద కొండ చరియలు విరిగిపడటంతో మట్టిలో కూరుకుపోయిన భక్తుల వాహనాలు



పెద్దవడుగూరులో కూలిన పీర్ల చావిడి ముందు భాగం

తాడిపత్రిటౌన్: తాడిపత్రి మండలంలో శనివారం రాత్రి వర్షం దంచికొట్టింది. దీంతో మండలంలోని బుగ్గ, ఆవులతిప్పాయిపల్లి, ఆలూరుకొన, దేవరకోన వంకలు పొంగిపొర్లాయి. బుగ్గ సమీపంలో నిర్మాణంలో వున్న 544డీ జాతీయ రహదారి వద్ద పాత రోడ్డు బ్రిడ్జి వరద ధాటికి కొట్టుకుపోవడంతో తాడిపత్రి నుంచి నంద్యాల వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడాయి. నిర్మాణంలో ఉన్న (544డీ జాతీయ రహదారి) మట్టి రోడ్డుపై వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఓ లారీ ఇరుక్కుపోయింది. దీంతో దాదాపు 3 కిలోమీటర్ల మేర వాహనాలుమూడు గంటల సేపు ఆగిపోయాయి. ఆవులతిప్పాయి పల్లె వద్ద వంక ఉధృతంగా ప్రవహించడంతో.. వంక దాటడానికి ప్రయత్నించి ఓ జీపు వాగులో కొట్టుకుపోయింది. డ్రైవర్ జీపులో నుంచి కిందకి దూకి ప్రాణాలు రక్షించుకున్నాడు. గ్రామస్తులు జీపును ఒడ్డుకు చేర్చారు. ఆలూరు కోన రంగనాథస్వామి ఆలయం వద్ద కొండ చెరియలు పడటంతో పార్కింగ్‌లో ఉంచిన భక్తులు వాహనాలు మట్టిలో కూరుకుపోయాయి. కాగా వర్షాలు లేక ఎండిపోతున్న ఆలూరు కోన జలపాతం ఉధృతంగా ప్రవహిస్తుండటంతో భక్తులు, పర్యాటకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెద్దవడుగూరులో భారీ వర్షం

పెద్దవడుగూరు: మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు సాగు చేసిన పంటలు సైతం నీట మునిగాయి. ఆదివారం ఉదయం పెద్దవడుగూరులోని పీర్ల చావిడి ముందుభాగం విరిగి పడింది. ఆ సమయంలో అక్కడ జనాలు ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. కాగా మండలంలో 10 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.



తాడిపత్రి మండలం బుగ్గ వద్ద బ్రిడ్జి కొట్టుకుపోవడంతో నిలిచిపోయిన వాహనాలు

పూర్వ విద్యార్థుల మానవత్వం



మిత్రుడికి నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పామిడి: అనారోగ్యంతో పంచానపడ్డ మిత్రుడి వైద్యఖర్చుల నిమిత్తం తోటి పూర్వ విద్యార్థులు రూ.22 వేలు ఆర్థికసాయం అందించి మానవత్వాన్ని చాటారు. వివరాలు ఇలా.. స్థానిక టీచర్స్ కాలనీకి చెందిన ఏఎస్ఎల్ నిర్వాహకుడు శ్రీధర్‌రావు కొంతకాలంగా పక్షవాతంతో మంచానపడ్డాడు. దీంతో కటుంబ జీవనం గడవడం కష్టమైంది. దీనికితోడు వైద్యం చేయించుకోవడానికి దుర్భర ఆర్థిక పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న తోటి 1993–94 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు చందాల రూపాన రూ.22 వేలు పోగుచేశారు. ఆదివారం మిత్రుని ఇంటికి వెళ్లి ఆ డబ్బు అందజేసి స్నేహబంధంతో కూడిన మానవత్వాన్ని చాటారు.

అపూర్వ సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

గుత్తి: పట్టణంలోని ఎమ్మెస్ హైస్కూల్‌లో 2000–2001లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. పాఠశాల రోజులను గుర్తు చేసుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులందరూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● ఆదమరిస్తే అంతే సంగతులు



భీమ్‌రెడ్డి కాలనీకి వెళ్లే రహదారిలో జీబీసీ కెనాల్ వద్ద ఏర్పడిన పెద్ద గొయ్యి

గుంతకల్లు: పట్టణ శివారులోని భీమ్‌రెడ్డి కాలనీ వెళ్లే రహదారిలో పెద్ద గొయ్యి పడింది. దీంతో వాహనాదారులు, పాదచారులు ఏమాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదంలో పడుతారు. భీమ్‌రెడ్డి కాలనీతోపాటు టీచర్స్ కాలనీకి వెళ్లాలంటే గుత్తి సబ్ బ్రాంచ్ (జీబీసీ) కెనాల్‌పై ఏర్పాటు చేసిన బ్రిడ్జి నుంచి రాకపోకలు సాగించాలి. అయితే బ్రిడ్జి చివరి భాగంలో పెద్ద గొయ్యి పడింది. అంతేకాకుండా జీబీసీలో కృష్ణ జలాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రాత్రి పూట ఈ మార్గంలో సంచరించే పాదచారులు, ద్విచక్రవాహనాదారులు గొయ్యిని గుర్తించక పలు ప్రమాదాలు చేటుచేసుకున్నాయని భీమ్‌రెడ్డి కాలనీ వాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే గొయ్యిని పూడ్చి వేయాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

'కోటంక'లో పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం మూడో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచా ర్యులు అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకార్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీలో ఉన్న రేకుల కుంట, అమ్మవారిపేట, రెడ్డిపల్లిలో సోమవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ మంత్రి శైలజానాథ్ ఆదేశాల మేరకు రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

కసాపురం ఈఓగా ఎం.విజయరాజు



గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఈఓగా ఆదివారం ఎం.విజయరాజు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఈఓగా పనిచేస్తున్న కే.వాణి ఉరుకుంద ఈరన్న దేవస్థానానికి బదిలీ కావడంతో, ఆమె స్థానంలో ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం నుంచి ఆయన బదిలీపై కసాపురం వచ్చారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానన్నారు.

సేవా దృక్పథం కలిగి ఉండాలి

గుంతకల్లు: ప్రతి ఒక్కరూ సేవ దృక్పథం కలిగి ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక వృద్ధాశ్రమంలోని వృద్ధులకు భోజనం సదుపాయం కల్పించడంతోపాటు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఎం.ఎం.రెడ్డి, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవం

పామిడి: మండలంలోని అన్ని చర్చీల్లో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో భూటాన్ దైవ సేవకురాలు సారా ప్రసంగించారు. క్రీస్తుకు మహిమకరంగా జీవించినప్పుడే నిత్యజీవం లభిస్తుందన్నారు. ఆమె ఆంగ్ల ప్రసంగాన్ని పాస్టరమ్మ సువర్ణమ్మ తెలుగులో అనువదించారు. చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

బైక్ బోల్తా – ఇద్దరికి గాయాలు

గుత్తి: గుత్తి ఆర్ఎస్ రోడ్డులోని కేంద్రీయ విద్యాలయం వద్ద ఆదివారం బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. జొన్నగిరికి చెందిన రామన్న, అప్పయ్య గుత్తికి బైక్‌లో వెళ్తుండగా.. మార్గమధ్యలో బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో గాయపడిన ఇద్దరినీ స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.